సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 18 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



బ్యాంకు ఎదుట వివాహిత ధర్నా

తల్లికివందనం సొమ్ముతో భర్తకు చికిత్స చేయించాలనుకోగా, బ్యాంకర్లు రుణం కింద జమ చేసుకున్నారు. దీంతో బ్యాంకు ఎదుట ఓ వివాహిత ధర్నాకు దిగింది. 8లో

గరిష్టం/కనిష్టం

35.1°/22.3°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 16 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఒక్క డయేరియా మరణమూ సంభవించకూడదు



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఒక్క డయేరియా మరణం కూడా సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో డయేరియా క్యాంపెయిన్ పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 31వ తేదీ వరకూ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. అందులో భాగంగా ఆశ కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఐదేళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లులకు డయేరియా గురించి అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు కడుగు విధానం, శుభ్రమైన తాగునీరు గురించి తెలియజేస్తూ ఓఆర్ఎస్, జింక్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల జాబితా అందజేయండి

ప్రశాంతి నిలయం: రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని జాబితాను తమకు అందజేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏజెంట్ల నియామకంలో నిబంధనలన్నీ కచ్చితంగా పాటించాలన్నారు. బూత్ ఏజెంట్లకు సంబంధిత బూత్‌లో తప్పక ఓటు ఉండి తీరాన్నారు. రాజకీయ పార్టీల తరఫున ఇంకా ఏవైనా సూచనలు, సలహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయ సారథితోపాటు పలు రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టు బెంచుల్లో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు ఆదేశాల మేరకు మంగళవారం న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.రాజశేఖర్ అధ్యక్షతన మున్సిపల్, ఆర్టీసీ అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ ఉచిత ప్రజా ప్రయోజన న్యాయ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎంవీఓపీ కేసులు, కొళాయి పన్ను, ఇంటి పన్ను కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు అధిక సంఖ్యలో కేసులు రాజీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యూజీ, పీజీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ జీవీ రమణ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల యూజీ, యూజీ ఆనర్స్, పీజీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. గత ఏప్రిల్, మే మాసాల్లో మెగా సప్లిమెంటరీ, డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఆనర్స్, 7వ సెమిస్టర్, పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఫలితాలను మంగళవారం ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ, కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, పరీక్షల విభాగపతి తిరుమలేష్ విడుదల చేశారు. 2016–19 మెగా సప్లిమెంటరీ పరీక్షలలో 94 శాతం, 6వ సెమిస్టర్ పరీక్షల్లో 99.6 శాతం, పీజీ 3వ సెమిస్టర్ లో 90 శాతం, ఆనర్స్ 7వ సెమిస్టర్‌లో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల ఫలితాలను కళాశాల వెబ్‌సైట్లో చూసుకోవచ్చని కళాశాల పరీక్షల విభాగాధిపతి తిరుమలేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉప పరీక్షా విభాగాధిపతులు అక్షుతానంద, చంద్ర శేఖర్, జీఎల్ఎన్ ప్రసాద్, పల్లవి, ఫిరోజ్ ఖాన్, అహ్మద్, నరసింహులు, సోమశేఖర్, కేశాలు, సూగప్ప, రమేష్ పాల్గొన్నారు.

- **హిం**దూపురానికి చెందిన వివాహితకు నెలలు నిండాయి. ప్రసవానికి ఇంకా 15 రోజుల గడువుందని వైద్యులు చెప్పారు. అయితే తన భర్త పుట్టిన రోజునాడే తాను బిడ్డకు జన్మనివ్వాలని భావించిన గర్భిణి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి సిజేరియన్ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆ తర్వాత బిడ్డ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో బెంగళూరుకు తీసుకెళ్లి రూ.6 లక్షలు ఖర్చు చేసి రెండు నెలల పాటు చికిత్స తీసుకున్నారు. అయినా బిడ్డ మానసిక ఎదుగుదలలో లోపం కనిపిస్తోందని.. మూర్ఖత్వంతో ముందుగానే సిజేరియన్ చేయించి తప్పు చేశామని ఈ దంపతులు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు.
- **దొ**డ్డబళ్లాపురానికి చెందిన ఓ వ్యక్తి గర్భిణిగా ఉన్న తన భార్యకు హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతి నెలా పరీక్షలు చేయించేవాడు. ఓ పురోహితుడి సూచన మేరకు మంచి ముహూర్తం ఉందని నెలలు నిండకముందే భార్యకు సిజేరియన్ చేయించాడు. చిన్నారి ఆరోగ్యం అదృష్టవశాత్తూ బాగుంది.. కానీ తల్లి ఆరోగ్యం క్షీణించడంతో తర్వాత బెంగళూరుకు తీసుకెళ్లారు.



2024 - 25లో ఇప్పటి వరకు జిల్లాలో ప్రసవాల వివరాలు ఇలా..

ఆస్పత్రి	సాధారణ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
ప్రభుత్వ ఆస్పత్రి	4,216	1,499	5,715
ప్రైవేటు ఆస్పత్రి	6,231	5,424	11,655

శిశువుకు ముహూర్త గండం

నిర్ణయించుకున్న సమయానికే పిల్లలకు జన్మనిచ్చేందుకు ఆరాటం

- ప్రసవాలకూ ముహూర్తం నిర్ణయించుకుంటున్న వైనం
- డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్న కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు
- తల్లీబిడ్డ ప్రాణానికి ప్రమాదమున్నా.. ముహూర్తానికే సిజేరియన్
- ముందస్తు ప్రసవాలతో పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం

సాక్షి, పుట్టపర్తి : మనిషి చంద్రమండలంలో అడుగు పెడుతున్న నేటి రోజుల్లోనూ... చాలా మంది ఇంకా మూఢనమ్మకాలను వీడడం లేదు. ముఖ్యంగా ముహూర్తాల పిచ్చితో కష్టాలు కొనితెచ్చుకుంటున్నారు. ముహూర్తం కలిసి వస్తే పర్వాలేదు గానీ... ఫలానా రోజే..ఫలానా ముహూర్తమే అన్నది ఇబ్బందిగా మారింది. కొందరైతే ప్రసవాలకూ ముహూర్తాలు నిర్ణయిస్తూ శిశువులు, వారికి జన్మనిచ్చే తల్లుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ముహూర్తాల పిచ్చితో అమ్మ కడుపునకు గాటు పెట్టించి.. బిడ్డలను బలవంతంగా తీస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి ముప్పు తలపెడుతున్నారు. ఈ జాఢ్యాన్ని కొందరు తల్లులతో పాటు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహిస్తుండటం వైద్యులను సైతం ఆందోళనకు గురి చేస్తోంది. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తోంది.

సిజేరియన్‌కే మొగ్గు

ఒకప్పుడు సిజేరియన్ పేరు చెబితే గర్భిణులు భయపడేవారు. బిడ్డ అడ్డం తిరిగినప్పుడు.. గర్భిణి నీరసంగా ఉన్నప్పుడు, రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు, గర్భంలో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, ఉమ్మనీరు పోతున్నప్పుడు, గర్భాశయ ముఖద్వారాన్ని మాయ కమ్మేసినప్పుడు తదితర అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే గతంలో సిజేరియన్ చేసేవారు. కానీ ప్రస్తుత కాలంలో సిజేరియన్ సర్వసాధారణంగా మారింది. సహజ కాన్పుతో కలిగే దీర్ఘకాలిక ప్రయోజనంపై అవగాహన లేకపోవడంతో చాలామంది సిజేరియన్‌కే మొగ్గు చూపుతున్నారు. సరైన ముహూర్తానికే పురుడు పోయాలని వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారు.

మారుమూల పల్లెల వరకు

ముహూర్తానికే సిజేరియన్ చేసి పురుడుపోసే సంప్రదాయం పట్టణాల నుంచి పల్లెల వరకూ పాకింది. ముహూర్తాల పేరుతో తమకు నచ్చిన రోజు.. నచ్చిన సమయానికే బిడ్డలకు జన్మనిచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో జిల్లా పరిధిలో జరిగిన ప్రసవాల సంఖ్యలో సిజేరియన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం... అందునా ప్రైవేటు ఆస్పత్రుల్లోనే అధికంగా నమోదు కావడం గమనార్హం. ముహూర్తాల పేరుతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి.. కావాల్సిన సమయానికి బిడ్డలకు జన్మనిస్తున్నారు. ఈ చెడు సంస్కృతి పట్టణాల నుంచి పల్లెల వరకు వ్యాపించింది. ఫలితంగా ప్రొలాక్టిన్ వంటి హార్మోన్లు విడుదల కాక పిల్లలు పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో తల్లిపాలు పట్టకపోతే బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుంది. సిజేరియన్‌తో పలు మూత్రాశయ వ్యాధులు కూడా సోకే ప్రమాదం ఉంది.

ప్రోత్సహిస్తున్న ప్రైవేటు డాక్టర్లు

కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు కూడా సిజేరియన్లను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ఒక సిజేరియన్‌కు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో 80 శాతం వరకు సిజేరియన్లు ఉండటం విశేషం. సిజేరియన్ చేస్తే ఆస్పత్రిలోనే వారం రోజుల పాటు బాలింతలు ఉండాల్సి వస్తోంది. దీంతో అదనంగా మరో రూ.15 వేల వరకు దండుకుంటున్నారు. సహజ ప్రసవమైతే రూ.20 వేల లోపు ఖర్చుతో పాటు రెండు రోజుల్లో డిశ్చార్జి కావచ్చు.

శిశువులకు ప్రమాదం



బిడ్డ జననం సహజంగా జరిగితే అది శిశువు మానసిక, శారీరక వికాసానికి దోహదపడుతుంది. సిజేరియన్ ద్వారా మంచి ముహూర్తాల కోసం నెలల నిండక ముందే జన్మనిస్తే.. ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. తక్కువ బరువు ఉంటారు. మానసిక ఎదుగుదల లోపిస్తుంది. బిడ్డలో ఆ సమయానికి అవసరమైన దాని కంటే తక్కువ హార్మోన్లు విడుదల కావడంతో పిల్లల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉంది.

– డాక్టర్ శివకుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, హిందూపురం

ముహూర్తం..మూర్ఖత్వం



కొందరు ముహూర్తం చూసుకుని సిజేరియన్ ద్వారా పిల్లలకు జన్మనిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. కడుపు కోత తల్లుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అంతేకాకుండా సమయానికి ముందే జన్మించడంతో చిన్నారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. సిజేరియన్ విషయంలో మూర్ఖత్వంతో వైద్యులపై ఒత్తిడి తేరాదు.

– డాక్టర్ ఫైరోజా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పుట్టపర్తి

తప్పులకు 'వందనం'

- 18 మంది పిల్లలకు తల్లి ఒకరేనట
- జాబితాలో పలువురు విద్యార్థుల పేర్లు గల్లంతు
- సమస్యలను పరిష్కరించేవారు కరువు
- తప్పుల తిప్పలతోనే సీఎం పర్యటన రద్దు!

పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకంలో తవ్వేకొద్దీ దారుణాలు బయటపడుతున్నాయి. దీనిపై ఒక్క అధికారి కూడా స్పందించడం లేదు. సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు..ఇలా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుట్టపర్తి మండలం పెడపల్లి–1 సచివాలయంలో బి.భావన అనే మహిళకు ఏకంగా 21 మంది పిల్లలు ఉన్నట్లు పేర్కొంటూ 'తల్లికి వందనం' తుది జాబితా ప్రదర్శించిన విషయం విదితమే. దీనిపై కనీసం విచారణ కూడా చేయడం లేదు. భావన ఎవరు, ఎక్కడ ఉంటుంది, ఆమెకు ఎంత మంది పిల్లలు, ఏ తరగతి చదువుతున్నారనే వివరాలు చెప్పలేకపోతున్నారు. ఇదిలా ఉండగానే ఇదే మండలం పెడపల్లి–2 సచివాలయంలో మరో విచిత్రం బయటపడింది. ఈ సచివాలయ పరిధిలో గువ్వలగుట్టపల్లి, సుబ్బరాయనిపల్లి, బత్తలపల్లి, కోనాపురం గ్రామాలు ఉన్నాయి. ఇందులో మూడు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 327 మంది అర్హులు ఉన్నట్లు తుది జాబితాలో చూపారు. అయితే..ఆయా పాఠశాలల్లో 60 మందికి పైగా విద్యార్థుల పేర్లు గల్లంతు అయినట్లు చెబుతున్నారు. ఈ గ్రామాల పరిధిలో ఎం.ఇంద్రజను 18 మంది విద్యార్థులకు తల్లిగా



పలువురు పిల్లలకు తల్లిగా ఇంద్రజ పేరును నమోదు చేసిన దృశ్యం

పేర్కొంటూ జాబితా ప్రదర్శించారు. అయితే.. ఈమె ఖాతాను ఇన్‌యాక్టివ్ లిస్ట్‌లో పెట్టి డబ్బు జమ చేయలేదు. అసలు ఈమె ఎవరన్న విషయం ఎవరికీ తెలియకపోవడం గమనార్హం. అసలు భావన, ఇంద్రజ పేర్లు గల వ్యక్తులు ఉన్నారా లేక జాబితా పెంచుకునేందుకు ఇలా చేశారా అనే విషయం విద్యాశాఖ, సచివాలయ అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ వింత జాబితాలను చూసి విద్యార్థులు, తల్లిదండ్రులు విస్తుపోతున్నారు. వాస్తవానికి తల్లికి వందనం నిధుల విడుదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పెడపల్లి పర్యటన ఉండేది. పోలీసులు బారికేడ్లను సైతం సిద్ధం చేశారు, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగించారు. అసంపూర్తిగా ఉన్న జాతీయరహదారి 342 పనులను శరవేగంగా పూర్తి చేయించారు. అయితే జాబితాలో తప్పులు అధికంగా ఉండడం , వందల కొద్దీ విద్యార్థుల పేర్లు తల్లికి వందనం పథకంలో రాకపోవడంతో చంద్రబాబు పర్యటన రద్దు అయినట్లు సమాచారం.

కాంట్రాక్టర్లకు దండి.. ఖజానాకు గండి!

- సీనరేజీ.. సున్నా
- జీఓ నంబర్ 6తో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లకు భారీ లబ్ధి
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.3,200 కోట్ల విలువైన రోడ్ల పనులు
- తాజా నిబంధనలతో రూ.130 కోట్ల వరకూ ఖజానాకు నష్టం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మైనింగ్ మాఫియాకు స్వయానా సర్కారే ఊతమిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఇప్పటికే యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్, క్వార్ట్జ్ ఖనిజాలను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ క్రమంలోనే జాతీయ రహదారుల నిర్మాణం చేపడుతున్న బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరుస్తూ ఇచ్చిన జీఓ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'రోడ్డు నిర్మాణ పనుల్లో తవ్విన మట్టిని ఎక్కడికైనా తోలుకోండి, పైసా కట్టక్కర లేదు' అన్న రీతిలో ఇచ్చిన జీఓ ఉమ్మడి అనంతపురం జిల్లాలో రహదారి నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆయాచిత లబ్ధి చేకూర్చినట్లుగా తెలుస్తోంది.

కోట్లాది రూపాయల నష్టం

ఈ ఏడాది జనవరి 20న జీఓ నం.6ను ప్రభుత్వం విడుదల చేసింది. కాంట్రాక్టర్లకు రూ.కోట్లకు కోట్లు దోచిపెట్టే జీఓగా దీన్ని అభివర్ణిస్తున్నారు. గతంలో ఏవైనా పనుల నిమిత్తం రోడ్డులో తవ్విన మట్టిని ఆ సమీపంలోనే ఏర్పడిన గుంతలను పూడ్చడానికి, అక్కడే ఇతర అవసరాలకు వాడుకోవాలనే నిబంధన ఉండేది. మట్టిని ఏదైనా కారణాలతో లారీ లేదా టిప్పర్‌ల ద్వారా అర కిలోమీటరు దూరం తరలించినా సీనరేజీ కట్టాల్సి ఉండేది. అయితే, కూటమి సర్కారు ఇచ్చిన జీఓ ప్రకారం ఇందుకు మినహాయింపు ఉంటుంది. మట్టిని ఎక్కడికైనా తరలించుకోవచ్చు. దీంతో సదరు కాంట్రాక్టర్లు భారీగా గుంతలు తవ్వుతూ ఆ మట్టిని ఇతర పనులకు వాడుకుంటున్నారు. ఈ క్రమంలో సహజ వనరులు లూటీ కావడం ఒకెత్తయితే, సర్కారుకు సీనరేజీ రూపంలో వచ్చే ఆదాయంలో భారీగా కోత పడిందని మైనింగ్ అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.3,200 కోట్ల పనులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం నుంచి మొదలుపెడితే తాడిపత్రి వరకూ రూ.3,200 కోట్లతో వివిధ మార్గాల్లో రోడ్డు పనులు జరుగుతున్నాయి. పుట్టపర్తి, పెనుకొండ, గుత్తి ఇలా పలు రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనుల ద్వారా మట్టిని తరలిస్తే కనీసం రూ.130 కోట్లకు పైనే సీనరేజీ వస్తుందని అధికారుల అంచనా. కానీ తాజా జీఓతో ఒక్క పైసా రాలేదు. ఉదాహరణకు శింగనమల వద్ద పనులు జరుగుతుంటే ఆ మట్టిని కదిరివైపు తరలిస్తున్నారు. ఇలా పనులు ఒక చోట, మట్టిని మరోచోటుకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రోడ్డు పనులు	55కు పైగా
వీటి విలువ	రూ.3,200 కోట్లకుపైగా
సీనరేజీ రూపంలో రావాల్సిన డబ్బు	రూ.130 కోట్లు పైనే
జీఓ నం.6 వల్ల వస్తున్న ఆదాయం	000

భారీగా ముడుపులు

కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే ఈ జీఓకు సంబంధించి కూటమి సర్కారు పెద్దలకు భారీ ముడుపులు అందినట్టు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్లలో సీనరేజీ నష్టపోతున్న పరిస్థితుల్లో... ముఖ్య నేతలకు రూ.కోట్లలో ముడుపులు చెల్లించి జీఓ విడుదల చేయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీనరేజీ చార్జీలు లేకపోవడంతో ఖజానాకు భారీ నష్టం చేకూరుతోంది.

రైతులపై బీమా బండ

- కూటమి సర్కారు ఘనకార్యం
- ప్రీమియం చెల్లింపునకు ఎగనామం
- ఉచిత పంటల బీమాతో వైఎస్ జగన్ హయాంలో రైతులకు భారీగా పరిహారం
- గతంలో 14.20 లక్షల మందికి రూ.1,883 కోట్ల బీమా

అనంతపురం అగ్రికల్చర్: కరువు రైతులపై కూటమి సర్కారు పంటల బీమా బండ వేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసి రైతులపై ప్రీమియం భారం మోపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో రూ.150 కోట్లకు పైగా ప్రీమియం రూపంలో రైతులు చెల్లించాల్సి ఉంటుంది. పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం కట్టించుకుంటాయి. మిగతా రైతులు సీఎస్‌సీ సెంటర్లలో ప్రీమియం కట్టి నమోదు చేయించుకోవాలి. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో నమోదైన రైతులు బీమా పథకాల పరిధిలోకి రానున్నారు. అయితే, దీనిపై జిల్లా వ్యవసాయశాఖ ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం గమనార్హం.

జిల్లాలో 12 పంటలకు..

క్లస్టర్ పరిధిలో ఉన్న అనంతపురం జిల్లాలో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, అరటి, చీనీ, దానిమ్మ, టమాట పంటలను చేర్చారు. అన్నింటినీ మండలం యూనిట్‌గా తీసుకుంటారు. వేరుశనగ హెక్టారుకు రూ. 80 వేలు, పత్తి రూ.95 వేలు, అరటికి రూ. 1.50 లక్షలు, చీనీకి రూ.1,37,500, దానిమ్మకు రూ.1,87,500, టమాటకు రూ.80 వేలు బీమా పరిహారంగా ఖరారు చేశారు. జూలై 15లోపు రైతులు తమ వాటా కింద ప్రీమియం చెల్లించాలి.



వేరుశనగ పంట

ఆటోమేటిక్ వెదర్‌బేస్డ్ స్టేషన్లలో నమోదైన వర్షపాతం, వాతావరణం, గాలిలో తేమశాతం, చీడపీడలు సోకే వాతావరణం తదితర వివరాల ఆధారంగా బీమా పరిహారం లెక్కకట్టనున్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో వాతావరణ బీమా అమలు కానుంది. ఇక ప్రధానమంత్రి ఫసల్‌బీమాలో క్లస్టర్ –1 కింద గుర్తించిన అనంతపురం జిల్లాలో గ్రామం యూనిట్‌గా కంది పంటను చేర్చారు. మండలం యూనిట్ కింద వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి, ఎండుమిరప పంటలకు వర్తింపజేశారు. కంది హెక్టారుకు రూ.50 వేలు, వరికి 1.02 లక్షలు, జొన్నకు రూ.52,500, మొక్కజొన్నకు రూ.82,500, ఆముదంకు రూ.50 వేలు, ఎండుమిరపకు రూ.2.25 లక్షలు బీమా పరిహారంగా ఖరారు చేశారు. వరి పంటకు ప్రీమియం ఆగస్టు 15 లోపు చెల్లించాలి. మిగతా పంటలకు జూలై 31న ఆఖరు తేదీగా నిర్ణయించారు. పంట కోత ప్రయోగాల్లో వచ్చిన దిగుబడుల ఆధారంగా పరిహారం లెక్కిస్తారు. ఈ క్రమంలో కందిలో అత్యధికంగా 846 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. అలాగే వరిలో 96, జొన్నలో 36, మొక్కజొన్నలో 72, ఆముదంలో 36, ఎండుమిరప పంటలో 36 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో 10 పంటలకు..

శ్రీ సత్యసాయి జిల్లాలో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, టమాట, చీనీ, దానిమ్మ పంటలకు వర్తింపజేశారు. ఇఫ్కో టోకియా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేయనుంది. ఫసల్‌బీమా కింద శ్రీ సత్యసాయి జిల్లాలో కంది పంటను గ్రామం యూనిట్‌గా తీసుకున్నారు. వరి, మొక్కజొన్నను మండలం యూనిట్‌గానూ, ఆముదం, రాగి పంటలను జిల్లా యూనిట్‌గా తీసుకున్నారు. కందిలో 720 పంట కోత ప్రయోగాలు, మొక్కజొన్నలో 84, వరిలో 36, రాగిలో 26, ఆముదంలో 26 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. అనంతపురం జిల్లా మాదిరిగా బీమా పరిహారం, ప్రీమియం చెల్లింపు, కటాఫ్ తేదీ నిర్ణయించారు.

వైఎస్ జగన్ హయాంలో హాయిగా...

2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రీమియం భారం పడకుండా ఉచితంగా పంటల బీమా పథకాలు అమలు చేయడంతో హాయిగా సాగిపోయింది. నిబంధనల మేరకు పరిహారం కూడా ఇవ్వడంతో రైతులకు భారీగా లబ్ధిచేకూరింది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 14.20 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,883 కోట్లు బీమా పరిహారం జమ అయింది. ప్రీమియం రూపంలో ఏటా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.150 కోట్ల వరకు ఆదా కావడం గమనార్హం. ఇపుడు ప్రీమియం బండ పడటంతో పాటు నిబంధనల మేరకు పరిహారం ఇచ్చి న్యాయం చేయడంపై రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

బీమా ప్రీమియం ఇలా..

వ్యవసాయ పంటలకు	2 శాతం
ఉద్యాన పంటలకు	5 శాతం
ఉమ్మడి జిల్లా రైతులపై పడే భారం	రూ.150 కోట్లకు పైగా

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు



నగదు లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. 83 రోజులకు గానూ రూ. 81,39,461 లక్షల నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.44,173 నగదుతో పాటు 10 అమెరికన్ డాలర్లు, 0.014 గ్రాముల బంగారం , 2.960 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈఓ కె.వాణి తెలిపారు. ఈ ప్రక్రియను ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది, పోలీసుల సమక్షంలో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వీరభద్రసేవా సమితి, హనుమాన్ సేవా సమితి, రాఘవేంద్ర సేవా సమితి, శ్రీరామ సేవాసమితి సభ్యులు చేపట్టారు.

క్లుప్తంగా

చేనేత కార్మికుడి దుర్మరణం


అంజనేయులు (ఫైల్)

ధర్మవరం అర్బన్: స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ చేనేత కార్మికుడు మృతి చెందాడు. సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన నిమ్మూర్తి అంజనేయులు(43)కు భార్య సరోజమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. చేనేత మగ్గాలకు జాకార్డులు కడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మండలంలోని గొట్లూరులో జాకార్డు కట్టడానికి మంగళవారం ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఆయన మార్కెట్‌యార్డు సమీపంలోని కల్యాణ మంటపం వద్దకు చేరుకోగానే ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని చోదకుడు ఉన్నఫళంగా ఆపడంతో వెనుకనే ఉన్న అంజనేయుడు ఢీకొన్నాడు. ఘటనలో కిందపడిన అంజనేయులుపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హస్త కళాకారులకు డిజైనర్ పోటీలు

అనంతపురం కల్చరల్: కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా లేపాక్షి, ఆప్కో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో హస్త, చేనేత కళాకారులకు రాష్ట్ర స్థాయి సావనీర్ డిజైనర్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య మంగళవారం వెల్లడించారు. 18 ఏళ్లకు పైబడిన హస్త కళాకారులు, చేనేత వృత్తిదారులు, డిజైనర్లు మాత్రమే కాకుండా విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ ప్రింట్లు, లెదర్ పప్పెట్స్, ఫుడ్ కార్వింగ్, ధర్మవరం.. ఉప్పాడ.. మంగళగిరి.. బండారు వస్త్రాల్లో నూతనత్వం ఉట్టిపడేలా కొత్త డిజైన్లను రూపొందించాల్సి ఉంటుంది. ప్రతి విభాగంలోనూ నగదు పురస్కారాలను అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు తాము రూపొందించిన నమూనాలను జూలై 16వ తేదీ లోపు లేపాక్షి ఎంపోరియం లేదా ఆప్కో షో రూమ్‌లో అందించాలి.

కొడిగెనహళ్లిలో వరుస చోరీలు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో సోమవారం రాత్రి రెండు చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. స్థానిక ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం తాళాలను బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు రూ. లక్ష నగదు అపహరించారు. అనంతరం అక్కడికి సమీపంలోని ఓ టీ కొట్టులో చొరబడి రూ.2 వేల విలువైన సరుకులను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం విషయాన్ని గుర్తించిన బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్‌బీఐ ఖాతాదారులసేవా కేంద్రం యజమాని యువరత్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేపట్టినట్లు ఏఎస్‌ఐ వెంకటేశులు తెలిపారు.

దొడ్డిదారి 'పాయింట్ల'పై చర్యలేవీ?

- టీచర్ల బదిలీల్లో ఇష్టానుసారంగా 'స్టేషన్' పాయింట్లు
- నిబంధనలు తుంగలో తొక్కి వందలాది మందికి 24 పైబడి పాయింట్లు
- ప్రతి మండలంలోనూ 6 నుంచి 10 మంది టీచర్ల అడ్డదారులు
- ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు
- ఎలాంటి చర్యలు లేకుండానే బదిలీల ప్రక్రియ పూర్తి


బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా దొడ్డిదారిన పాయింట్లు పొందిన వారిపై చర్యలు తీసుకోకుండా వారికి సౌకర్యవంతమైన స్కూళ్లను కేటాయించిన జిల్లా విద్యాశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా స్టేషన్ పాయింట్ల నమోదులో విపరీతమైన అక్రమాలు చోటు చేసుకున్నాయి. స్టేషన్ సర్వీస్ పాయింట్లు గరిష్ఠంగా 24కు (3వ కేటగిరి) మించి ఉండకూడదని నిబంధనలున్నాయి. ఎందుకంటే స్టేషన్ సర్వీస్ 8 ఏళ్లకు స్లాబ్ చేశారు. 9 నుంచి10 ఏళ్ల సర్వీస్ ఉన్నా, 24 పాయింట్లే వేయాలి. అయితే కొందరు తాము పని చేసిన మొత్తం సర్వీస్‌కు పాయింట్లు వేసుకోవడంతో 27, 30 చొప్పున పాయింట్లు వచ్చాయి. ఇలాంటి వారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుప్పలు తెప్పలుగా ఉన్నారు. ప్రతి మండలం నుంచి కనీసం 6 నుంచి 10 మంది టీచర్లు అక్రమంగా పాయింట్లు నమోదు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఎస్జీటీ తెలుగుకు సంబంధించి 84 మంది స్టేషన్ పాయింట్లు ఎక్కువగా వేసుకున్నారని అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

రీపోర్స్‌మెంట్‌కు గురైన టీచర్లకు ఇలా..

రీపోర్స్‌మెంట్‌కు గురైన టీచర్లకు 24 పాయింట్లు వచ్చేందుకు ఆస్కారం లేదు. ఉదాహరణకు పాతస్టేషన్‌లో 6 ఏళ్లు, కొత్త స్టేషన్‌లో రెండేళ్లు పని చేసి రీపోర్స్‌మెంట్‌కు గురై ఉంటే ఏదో ఒక్క స్టేషన్ పాయింట్లు మాత్రమే పొందాల్సి ఉంది. ఈ లెక్కన పాత స్టేషన్ మాత్రమే తీసుకుంటే ఆరేళ్లకు 18 పాయింట్లు ఇస్తారు. లేదా కొత్త స్కూల్ తీసుకుంటే రెండేళ్లకు నాలుగు పాయింట్లతో పాటు అదనంగా 5 ప్రత్యేక పాయింట్లు ఇస్తారు. ఒకవేళ రెండుసార్లు రీపోర్స్‌మెంట్ (2023, 2025)కు గురై ఉంటే 7 ప్రత్యేక పాయింట్లు వస్తాయి. ఇక్కడ పాత స్కూల్ పాయింట్లు డ్రా చేసుకునేందుకు వీలులేదు. దీంతో చాలా మంది ఈ రెండు విధానాలను లెక్కకట్టి ఎక్కువ పాయింట్లు ఉన్న దానిని ఎంచుకోవడం సహజం. అయితే కొందరు టీచర్లు అక్రమంగా వీలైనన్ని పాయింట్లు పొందారు. ఈ క్రమంలో పాత స్టేషన్, కొత్త స్టేషన్ రెండూ కలిపి పాయింట్లు వేసుకున్నారు. దీనికి రీపోర్స్‌మెంట్ పాయింట్లూ కలుపుకున్నారు.

ఎంఈఓలు, డీఈఓ కార్యాలయ సిబ్బంది అండతోనే

టీచర్లు పొరపాటునో, లేదా కావాలనో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ పాయింట్లు వేసుకుంటే ఒకటికి రెండుసార్లు పరిశీలించి వాటిని తొలిగించాలంటూ అధికారులకు విద్యాశాఖ కమిషనర్ పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హడావుడి, తీవ్రమైన గందరగోళం నెలకొన్న పరిస్థితుల్లో మండలాల్లో ఎంఈఓలు కాని, జిల్లా కేంద్రంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, సాంకేతిక నిపుణలు ఇవేవీ పట్టించుకోలేదు. టీచరు ఆన్‌లైన్‌లో 'దరఖాస్తు చేసుకున్నాడా...ఎంఈఓ నిర్ధారించారా...మేమూ నిర్ధారించామా' అనేలా ప్రక్రియ పూర్తి చేశారు. అక్రమంగా పొందిన పాయింట్ల ఆధారంగా చాలామంది టీచర్లు మంచి స్థానాలకు వెళ్లారు.

అడ్డగోలుగా 'ప్రిఫరెన్షియల్ కేటగిరీ', 'స్పెషల్' పాయింట్లు

మరోవైపు 'ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్లు పొందడంలోనూ చాలామంది టీచర్లు అడ్డదారులు తొక్కారు. కొందరు వైద్యులు కక్కుర్తిపడడంతో లేని రోగాలు ఉన్నట్లు, సర్జరీ చేయకపోయినా చేసినట్లు, సాధారణ రోగాలను పెద్ద రోగాలుగా చూపిస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారు. చాలామంది టీచర్లు ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ఇంకొందరు ప్రత్యేక పాయింట్లు పొంది మంచిస్థానాలకు వెళ్లారు. నార్పల ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఓ టీచరుకు ఎలాంటి సర్జరీ జరగలేదు. అయినా సర్జరీ జరిగినట్లు సర్టిఫికెట్ పెట్టి నగరంలోని ప్రభుత్వ స్కూల్‌కు వచ్చారు. చెన్నేకొత్తపల్లి మండలంలో పని చేస్తున్న ఓ టీచరు.. స్పైనల్ సర్జరీ చేయించుకున్నట్లు డాక్టర్ సర్టిఫికెట్ పొంది మండల కేంద్రానికి వచ్చారు. సర్జరీ విషయం ఎస్ఆర్‌లో ఎంట్రీ లేదు. తీరా బదిలీల సమయంలో ఇలా నకిలీ సర్టిఫికెట్‌తో దగ్గర స్కూల్‌కు వచ్చి తమకు అన్యాయం చేశారని జాబితాలో ఆ టీచరు వెనుక ఉన్న టీచర్లు వాపోయారు. వ్యక్తిగతంగా అర్జీలు ఇచ్చిన టీచర్ల పాయింట్లు మార్పు చేశారు కానీ, ఫలానా టీచర్లు అక్రమంగా పాయింట్లు వేసుకున్నారంటూ ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చేసిన ఫిర్యాదులన్నీ బుట్టదాఖలయ్యాయి. కాగా...అక్రమంగా పాయింట్లు పొందిన ప్రతి టీచరుపైనా ఖచ్చితంగా చర్యలుంటాయని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు పేర్కొనడం కొసమెరుపు.

బ్రాహ్మణ మహా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ద్వారకానాథ్



ధర్మవరం: అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన కై పా ద్వారకానాథ్ శర్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ మంగళవారం ఉత్తర్వులు అందించారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ, రాష్ట్ర ప్రతినిధి అనంతకుమారి, రాష్ట్ర ఏబీవీఎం ఈడీ సెల్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నరేష్‌కుమార్‌కు ఈ సందర్భంగా ద్వారకానాథ్ శర్మ కృతజ్ఞతలు తెలిపారు.

రిమాండ్‌కు ముగ్గురు

కదిరి టౌన్: పోలీసులమంటూ లారీని ఆపి డబ్బు వసూళ్లకు పాల్పడిన కేసులో మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో కదిరికి చెందిన పాట్టిండ్ల నాగభూషణం, భూక్యా ఆంజనేయులు నాయక్, మందల కుళ్లాయప్ప ఉన్నారు. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ మారుదముత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వివాహిత హత్య కేసులో భర్త అరెస్ట్

హిందూపురం: వివాహిత హత్య కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను మంగళవారం డీఎస్పీ మహేష్ వెల్లడించారు. లేపాక్షి మండలం పులమతి గ్రామానికి చెందిన సవిత (35) ఈ నెల 5న రాత్రి అనుమానాస్పద స్థితి మృతి చెందింది. ఘటనపై మృతురాలి తల్లి గంగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టి సవిత హత్యకు గురైనట్లుగా నిర్ధారించి, ఆ దిశగా కేసు దర్యాప్తు చేపట్టారు. సవిత భర్త ఆదినారాయణ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులో తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. సవిత ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న ఆదినారాయణ తరచూ ఆమెను వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 5న రాత్రి సవిత గొంతుకు చీర బిగించి హతమార్చాడు. అనంతరం తన గొర్రెల షెడ్డులోని పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించాడు. నేరాన్ని అంగీకరించడంతో ఆదినారాయణను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో చోటు

కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లా వాసులకు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దుంగావత్ రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎం.భాస్కర్‌నాయక్, జాయింట్ సెక్రటరీగా డి.కుళ్లాయినాయక్, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.హెచ్.బాషా, జాయింట్ సెక్రటరీలుగా పి.నిజార్ అహమ్మద్, షేక్ మునావర్, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఉంట్ల లక్ష్మీపతి రెడ్డి, గ్రీవెన్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వై.వెంకట రంగారెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎం.జగన్‌మోహన్‌రెడ్డికి చోటు కల్పించారు.

వీర జవాన్ కుటుంబానికి ప్రభుత్వ సౌలభ్యాలు



మురళీనాయక్ తల్లిదండ్రులకు రూ.50 లక్షల చెక్కు, భూమి పట్టాలను అందజేస్తున్న మంత్రి సవిత

గోరంట్ల: ప్రకటించిన మేరకు వీర జవాన్ కుటుంబానికి ప్రభుత్వ సౌలభ్యాలు అందజేస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా అమరుడైన గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.50లక్షల చెక్‌తో పాటు ఐదు ఎకరాల పొలం, ఇంటి స్థలానికి సంబంధించిన పట్టాలను మంగళవారం మంత్రి అందజేసి, మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయితో మాట్లాడారు. మురళీనాయక్ ఇంటి నుంచి సమాధి వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.16 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గోరంట్లలో మురళీనాయక్ స్మారక వనం, జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గోరంట్లలో పలు అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ మారుతి, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి తీరుపై బీజేపీ నేతల ఆగ్రహం

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి సవిత కార్యక్రమాలకు స్థానిక బీజేపీ నేతలను ఆహ్వానించకపోవడంపై ఆ పార్టీ మండల కన్వీనర్ భోయ లక్ష్మీనారాయణ అగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేరుకే కూటమి ప్రభుత్వం ఉందని, క్షేత్రస్థాయిలో కూటమిలో భాగమైన బీజేపీ నాయకులకు టీడీపీ నేతలు ఏ మాత్రం గౌరవించడం లేదని మండిపడ్డారు. అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ నిధులు వెచ్చిస్తుండగా.. బీజేపీ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకుండా అంతా తమ గొప్పగానే ప్రకటించుకునే ప్రయత్నాలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని మంత్రి సవితకు ఆయన హితవు పలికారు.

బ్యాంక్ ఎదుట వివాహిత ధర్నా

- చావు బతుకుల్లో భర్తకు చికిత్స చేయించలేక ఇబ్బంది
- 'తల్లికి వందనం' నగదు జమ చేసుకున్న బ్యాంకర్లు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగాధరప్ప

సోమందేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద జమ చేసిన నగదు విత్ డ్రాకు బ్యాంక్ మేనేజర్ సహకరించడం లేదంటూ ఓ వివాహిత ఆ బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. సోమందేపల్లి మండలం చల్లాపల్లికి చెందిన దళితులైన నాగమణి, గంగాధరప్ప దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా, అందరూ చదువుకుంటున్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న గంగాధరప్ప రెండు కిడ్నీలు చెడిపోవడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో వైద్య చికిత్సలు, తరచూ డయాలసిస్‌కు వెళ్లి రావడానికి చేతిలో చిల్లి గవ్వలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో తల్లికి వందనం పథకం కింద రూ.13 వేలను ప్రభుత్వం నాగమణి బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. విషయం తెలియగానే భర్తకు డయాలసిస్ చేయించేందుకు అన్ని ఏర్పాటు చేసుకుని డబ్బు కోసం నాగమణి మాగేచెరువులోని కెనరాబ్యాంక్ శాఖకు వెళ్లి నగదు విత్ డ్రా చేసేందుకు ప్రయత్నించింది. అయితే డ్వాక్రా బకాయి రుణాలు కట్టేంత వరకూ నగదు విత్ డ్రాకు వీల్లేదని మేనేజర్ అడ్డుకున్నారు. నాలుగు రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతూ మేనేజర్‌ను ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం మరోసారి బ్యాంక్‌కు వెళ్లి డయాలసిస్ చేయకపోతే తన భర్త ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని, నగదు విత్ డ్రాకు సహకరించాలని మేనేజర్‌ను వేడుకుంది. అయినా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో బ్యాంక్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పిల్లలకు ఫీజులు కట్టాలని, భర్తకు డయాలసిస్ చేయించాల్సి ఉందని.. నగదు విత్ డ్రా చేసేందుకు మేనేజర్ సహకరించడం లేదంటూ కన్నీటి పర్యంతమైంది. గ్రామంలోని వెంకటేశ్వర గ్రూప్‌లో సభ్యురాలైన తాను 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో తీసుకున్న రూ.3.80 లక్షల రుణానికి సంబంధించి సభ్యులు సకాలంలో చెల్లించకపోతే తనను మాత్రమే ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సబబంటూ ప్రశ్నించింది. ఈ అంశంపై వివరణ కోరేందుకు పాత్రికేయులు ప్రయత్నిస్తే బ్యాంక్ మేనేజర్ అందుబాటులోకి రాలేదు.

నేర సమాచారం

ట్రాక్టర్ కిందపడి రైతు మృతి


మృతుడు శ్రీనివాసులు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు(62) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... అమీనాబాదు గ్రామానికి చెందిన శ్రీనివాసులు మంగళవారం ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అదుపు తప్పి కిందపడ్డాడు. అతని మీదుగా ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ప్రమాదంలో బైక్ రైడర్..


మృతుడు సుబ్రహ్మణ్యం

గుత్తి రూరల్: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ బైక్ రైడర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌కు చెందిన సుమారు 20 మంది బైక్ రైడర్లు ఇటీవల బెంగళూరుకు జాలీ ట్రిప్ నిర్వహించారు. ఈ క్రమంలో ట్రిప్ పూర్తి కావడంతో తిరుగు ప్రయాణమైన వారు మంగళవారం వేకువజామున గుత్తి మండలం ఊబిచెర్ల వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై బైక్ రైటర్ ఆదిత్య సుబ్రమణ్యం (44) నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆదిత్యను వెంటనే హైవే అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..


మృతుడు అమర్‌నాథ్

తాడిపత్రి టౌన్: స్థానిక రూరల్ పరిధిలోని అర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో వైఎస్సార్ కడప జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన అమర్‌నాథ్ (30) మృతి చెందాడు. అర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న అమర్‌నాథ్ ద్విచక్ర వాహనంపై తాడిపత్రి నుంచి ఫ్యాక్టరీకి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అతిగా మద్యం సేవించి గుర్తు తెలియని వ్యక్తి..

తాడిపత్రిలోని సీబీ రోడ్డులో మంగళవారం అతిగా మద్యం సేవించి అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తిని పోలీసులు గుర్తించారు. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం


మృతుడు ఇంతియాజ్


గుత్తి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో నివాసముంటున్న చాంద్ బాషా కుమారుడు ఇంతియాజ్ (24) ఓ యువతిని ప్రేమించాడు. ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే పెద్దలు అంగీకరించలేదు. పంచాయితీ పెట్టి ఇద్దరూ కలుసుకోకూడదని నిర్ణయించారు. దీంతో కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ వచ్చిన ఇంతియాజ్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి ఆత్మహత్య


నాగలింగ (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని నల్లదాసరపల్లి సర్పంచ్ పార్వతి భర్త నాగలింగ (66) ఆత్మహత్య చేసుకున్నాడు. తమకున్న ఇద్దరు కుమారులకు నాగలింగ దంపతులు పెళ్లిళ్లు చేయడంతో ఎవరికి వారు వేరు కాపురాలు ఉంటున్నారు. వృద్ధులైన తల్లిదండ్రులు తరచూ కుమారుల ఇళ్లకు వెళ్లి వచ్చేవారు. ఉన్న కొద్దిపాటి భూమిని కుమారులు సమానంగా పంచుకుని వ్యవసాయం చేసుకుంటున్నారు. పెద్ద కుమారుడు రాజు మిరప సాగులో నష్టపోయి అప్పులపాలయ్యాడు. రెండేళ్లుగా పంట సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. గత ఏడాది పండించిన 40 క్వింటాళ్ల మిరప పంటను బళ్లారిలోని స్టోరేజ్ పాయింట్‌లో రాజు నిల్వ చేశాడు. ఆ పంటను విక్రయించి అప్పు కట్టాలని తరచూ కుమారుడికి నాగలింగ చెబుతూ వచ్చేవాడు. మంగళవారం ఉదయం మరోసారి పంట విక్రయం, అప్పులు చెల్లించే విషయాన్ని తండ్రి గుర్తు చేయడంతో ధర గిట్టుబాటు అయ్యేంత వరకూ పంట అమ్మేది లేదని రాజు గట్టిగా చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో అప్పుల ఊబిలో కుమారుడు కూరుకుపోతున్నాడనే వేదనతో నాగలింగ ఇంటి బయట ఉన్న బాత్‌రూంలో ఉంచిన పెట్రోల్ తీసుకుని శరీరంపై వేసుకుని నిప్పంటించుకున్నాడు. ఒక్కసారిగా ఎగిసి పడిన మంటలను గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే మంటలను ఆర్పి అంబులెన్స్ ద్వారా నాగలింగను గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త దాడి - భార్య మృతి


హతురాలు నందిని

రాప్తాడు: భర్త దాడిలో గాయపడిన భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన బలిజ విజయ్‌కుమార్, ఇటుకలపల్లికి చెందిన బోయ నందిని ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా, ఆమెకు ఇది రెండో వివాహం, విజయ్‌కుమార్‌కు మొదటి పెళ్లి. ఏడాదిగా రాప్తాడులోని బీసీ కాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో నందిని ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న విజయ్‌కుమార్ రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని ఆమెతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి విచక్షణారహితంగా నందినిపై దాడి చేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న నందినిని సర్వజనాస్పత్రికి తరలించారు. విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం నందిని మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సెక్యూరిటీ గార్డు అరెస్ట్

- 19 సెల్‌ఫోన్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నిందితుడి (బ్లూ టీషర్ట్) ని చూపుతున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

గుంతకల్లు: సెల్‌ఫోన్లు అపహరించి అజ్ఞాతంలోకి వెళ్లిన సెక్యూరిటీ గార్డు శుభాంకర్‌ను అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రయాణికుల భద్రత చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గుంతకల్లు జంక్షన్‌లోని ప్లాట్‌ఫారాలు, రైళ్లలో తనిఖీలు చేపట్టాయి. ఆ సమయంలో బెంగుళూరు నుంచి భువనేశ్వర్ వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో అనుమానస్పదంగా కనిపించిన శుభాంకర్ బ్యాగ్‌ను పరిశీలిస్తే 19 సెల్‌ఫోన్లు బయటపడ్డాయి. ఒడిశాకు చెందిన శుభాంకర్ బెంగుళూరులోని టవర్ కేర్ ప్రాంతంలోని కేపీఎస్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అందులో పని చేస్తున్న ఉద్యోగులు నిబంధన మేరకు తన వద్ద డిపాజిట్ చేసిన సెల్‌ఫోన్లు అపహరించి స్వగ్రామానికి వెళుతున్నట్లుగా విచారణలో అంగీకరించాడు. కాగా, శుభాంకర్‌పై కేపీఎస్ ఫ్యాక్టరీ ఉద్యోగులు టవర్ కేర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న శుభాంకర్‌ను టవర్ కేర్ పోలీసులకు గుంతకల్లు రైల్వే పోలీసులు అప్పగించారు.

టెన్త్ టాపర్‌కు బాల్య వివాహయత్నం

నార్పల: టెన్త్ టాపర్‌కు బాల్య వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు సిద్ధం కావడంత అప్రమత్తమైన అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకెళ్తే శింగనమల మండలం బండమీదపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన నార్పల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అత్యుత్తమ మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. అయితే బాలికకు ఆమె మేనమామతో వివాహం జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేయడంతో విషయం తెలుసుకున్న అధికారులు అడ్డుకున్నారు. కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఏఎంసీకి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పూర్వ సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అనంతపురం మెడికల్ కళాశాల (ఏఎంసీ)కు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలులో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారనే కారణంతో ప్రభుత్వం ఆయనను బదిలీ చేసింది. ఆయన సేవలను దృష్టిలో ఉంచుకుని కర్నూలులోనే కొనసాగించాలని ప్రభుత్వానికి కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ విన్నవించారు. కాగా సోమ, మంగళవారాల్లో జూమ్ ద్వారా నిర్వహించిన బదిలీల్లో కళాశాలలో మొత్తం 19 మంది వైద్యులకు స్థానచలనం కలిగింది. వీరిలో అనంతపురానికి గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మాధవీలత (ఫిజియాలజీ), అసిస్టెంట్ ప్రొఫెసర్లలో డాక్టర్ మీనిగ శ్రీనివాసులు(జనరల్ మెడిసిన్), డాక్టర్ పి.స్నేహ, పి.మమత(గైనకాలజీ), డాక్టర్ అనురాధ(ఆప్తమాలజీ) బదిలీ అయ్యారు.

20న ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్: టైమ్స్ ప్రో ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగాలకు సంబంధించి ఈ నెల 20న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ ఉత్తీర్ణత, 26 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్‌లో 20న జరిగే జాబ్‌మేళాకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావచ్చు.